

పురుషుల సమగ్ర వెల్‌నెస్ ప్రోగ్రాం పోస్టరును ఆవిష్కరిస్తున్న డాక్టర్ పూర్ణచంద్రారెడ్డి, డాక్టర్ సూరజ్ పిన్ని

నగర పురుషుల్లో పెరుగుతున్న వంధ్యత్వం

- ఒత్తిడితో కూడిన జీవనం, నిద్రలేమి కారణం: ఏఐఎన్‌యూ డైరెక్టర్ డాక్టర్ పూర్ణచంద్రారెడ్డి

పంజాగుట్ట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మానసిక ఒత్తిడి, నిద్రలేమి కారణంగా పురుషులు వంధ్యత్వ సమస్యలు పెరుగుతున్నాయని బంజారాహిల్స్ ఏసియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ నెఫ్రాలజీ, యూరాలజీ (ఏఐఎన్‌యూ) ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, చీఫ్ కన్సల్టెంట్ డాక్టర్ పూర్ణచంద్రారెడ్డి అన్నారు. నగరంలోని పురుషుల్లో వంధ్యత్వం పెరుగుతోం దని, ప్రతీ ఇద్దరు మహిళలు, పురుషుల్లో లైంగిక, జనన సంబంధిత సమస్యలు పెరుగుతున్నాయని అన్నారు. అంతర్జాతీయ పురుషుల దినోత్సవం పురస్కరించుకుని బుధవారం ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన సమావేశంలో పురుషుల సమగ్ర వెల్‌నెస్ ప్రోగ్రాం పోస్టరును కన్సల్టెంట్ యూరాలజిస్ట్ డాక్టర్ సూరజ్ పిన్నితో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పూర్ణచంద్రారెడ్డి మాట్లాడుతూ, పురుషుల్లో పెరుగుతున్న వంధ్యత్వం (సంతాన రాహిత్యం), లైంగిక పటుత్వం లోపించడం లాంటి సమస్యలపై ప్రధానంగా దృష్టిసారించామన్నారు. పురుషుల కోసం రూపొందించిన ప్రత్యేక ప్యాకేజీలో ఆండ్రాలజిస్టు పరీక్షలతో పాటు హార్మోన్ ప్రొఫైలింగ్, ప్రోస్టేట్ స్క్రీనింగ్, జీవనశైలి అంచనా, వీర్యపరీక్షలు ఉంటాయని తెలిపారు.

టీడబ్ల్యూజేఎఫ్ నుంచి అధ్యక్షుడి బహిష్కరణ

- మరికొందరిపైనా వేటు
- సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బసవపున్నయ్య

హైదరాబాద్ సిటీ, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర మహాసభల నిర్వహణ కార్యక్రమాల కోసం అడహక్ కమిటీ ఏర్పాటు చేస్తూ రాష్ట్ర కార్యవర్గ సమావేశం తీర్మానం చేసింది. బుధవారం హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్ర అత్యవసర కార్యవర్గ సమావేశంలో సుదీర్ఘంగా చర్చించి టీడబ్ల్యూజేఎఫ్ నుంచి రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య, ఉపాధ్యక్షులు బండి విజయ్‌కుమార్, వల్లాల జగన్, కార్యదర్శి తన్నీరు శ్రీనివాస్, కరీంనగర్ జిల్లా కార్యదర్శి కుడితూడి బాపూరావును శాశ్వతంగా బహిష్కరించాలని తీర్మానించింది. వీరి ప్రాథమిక సభ్యత్వాన్ని సైతం రద్దు చేస్తూ నిర్ణయం తీసుకుంది. 'వీరంతా కొంతకాలంగా సంఘం నియమ, నిబంధనలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తూ ఏకపక్ష నిర్ణయాలతో టీబ్ల్యూజేఎఫ్‌కు భంగం కలిగిస్తూ ప్రతిష్టను దెబ్బతీస్తున్నారు. సంఘం సభ్యత్వ రుసుంను దుర్వినియోగం చేశారు. ఇక నుంచి వీరికి తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్)తో ఎలాంటి సంబంధం లేదు. వీరు నిర్వహించే సమావేశాలు, ఇతర కార్యక్రమాలకు టీడబ్ల్యూజేఎఫ్‌కు సంబంధం లేదన్న విషయాన్ని జర్నలిస్టు మిత్రులు, సంఘం శ్రేయోభిలాషులు గుర్తించాలని' టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి. బసవపున్నయ్య పేర్కొన్నారు.

వీసా గడువు ముగిసినా అక్రమంగా తిష్ట

- నైజీరియన్ స్మగ్లర్ ఆటకట్టించిన హెచ్ న్యూ టీమ్
- దేశం నుంచి బహిష్కరించి డిపోర్టేషన్ చేసిన పోలీసులు

హైదరాబాద్ సిటీ, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): వీసా గడువు ముగిసిన నగరంలో అక్రమంగా ఉంటూ డ్రగ్స్ స్మగ్లింగ్ చేస్తున్న నైజీరియన్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. హైదరాబాద్ నార్కోటిక్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్ (హెచ్ న్యూ) డీసీపీ సుధీంద్ర తెలిపిన వివరాల ప్రకారం... నైజీరియాకు చెందిన ఓన్యూక్యూ కిలేచీ విక్టర్.. స్టూడెంట్ వీసాపై 2021 లో ఇండియాకు వచ్చి బెంగళూరులోని నోబుల్ కాలేజీలో బీసీఏలో చేరాడు. కొద్దిరోజులకే చదువు మానేసిన ఓన్యూక్యూ కిలేచీ విక్టర్.. బెంగళూరులోని నైజీరియన్స్‌తో కలిసి కమీషన్ తీసుకుని బెంగళూరు, హైదరాబాద్‌లోని పెడ్లర్స్‌కు డ్రగ్స్ సరఫరా చేసేవాడు. డ్రగ్స్ స్మగ్లర్స్‌పై నిఘా పెట్టిన హెచ్‌న్యూ పోలీసులు.. బంజారాహిల్స్‌లో ఓ డ్రగ్స్ పెడ్లర్‌తో కలిసి ఓన్యూక్యూ కిలేచీ విక్టర్ తిరుగుతున్నట్లు సమాచారం అందింది. రంగంలోకి దిగిన హెచ్ న్యూ పోలీసులు ఇద్దరినీ అదుపులోకి తీసుకున్నారు. పెడ్లర్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కాగా.. నైజీరియన్ వద్ద ఎలాంటి ధ్రువపత్రాలు లేకపోవడం, 2024 ఏప్రిల్‌లోనే వీసా గడువు ముగిసిపోయినట్లు గుర్తించారు. అతని పాస్‌పోర్టు మాత్రమే 2028 వరకు చెల్లుబాటు అయ్యేలా ఉంది. దీంతో ఓన్యూక్యూ కిలేచీ విక్టర్‌ను దేశం నుంచి బహిష్కరించి డిపోర్టేషన్ చేయాలని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ ఆదేశించారు. బుధవారం హైదరాబాద్ శంషాబాద్ రాజీవ్‌గాంధీ ఇంటర్నేషనల్ ఏయిర్ పోర్టులో విమానం ఎక్కించి వారి దేశానికి డిపోర్టేషన్ చేసినట్లు డీసీపీ తెలిపారు. ఈ ఏడాదిలో ఇప్పటి వరకు 11 మంది నైజీరియా స్మగ్లర్స్‌ను హెచ్ న్యూ పోలీసులు డిపోర్టేషన్ చేశారని, 2022 నుంచి ఇప్పటి వరకు 33 మంది విదేశీ స్మగ్లర్స్‌ను అరెస్టు చేసి కటకటాల్లోకి నెట్టారని డీసీపీ సుధీంద్ర వెల్లడించారు.

విద్యార్థినిపై లైంగిక దాడి

- నిందితుడికి 25 ఏళ్ల జైలు, రూ. 10 వేలు జరిమానా

హైదరాబాద్ సిటీ, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రేమ పేరుతో జూనియర్ విద్యార్థినిపై లైంగిక దాడికి పాల్పడ్డ సీనియర్ విద్యార్థికి న్యాయస్థానం 25 ఏళ్ల జైలు శిక్ష విధించింది. వివరాల్లోకి వెళితే... సికింద్రాబాద్ మెట్టుగూడకు చెందిన ఆశం శ్రీరాములు(18) నగరంలోని ఓ కాలేజీలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. అదే కాలేజీలో చదువుతున్న జూనియర్ విద్యార్థిని(16)పై కన్నేశాడు. ఇన్ స్టాగ్రామ్‌లో పరిచయం పెంచుకొని ప్రేమ పేరుతో దగ్గరయ్యాడు. బాలిక నగ్న ఫొటోలు, వీడియోలు తీసుకున్నాడు. వాటిని చూపించి డబ్బు ఇవ్వాలని వేధించాడు. ఈ క్రమంలో బాలికపై శ్రీరాములు పలుమార్లు లైంగిక దాడికి పాల్పడ్డాడు. బాలిక కాలేజీ వెళ్లకుండా ఇంట్లో ఉండడంతో తల్లిదండ్రులు మందలించగా జరిగిన విషయం చెప్పింది. దాంతో తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేయగా లాలాగూడ పోలీసులు పోక్సో కేసు నమోదు చేసి నిందితుడిని జైలుకు తరలించారు. కేసు దర్యాప్తు చేపట్టి పోలీసులు పక్కాగా ఆధారాలు సేకరించి నిందితుడుని నాంపల్లి 12వ అడిషనల్ మెట్రోపాలిటన్ సెషన్ కోర్టు న్యాయమూర్తి ఎదుట హాజరు పరిచారు. కేసు పూర్వపరాలు పరిశీలించిన న్యాయమూర్తి నిందితుడు శ్రీరాములుకు 25 జైలుశిక్ష, రూ.10వేల జరిమానా విధిస్తూ బుధవారం తీర్పును వెలువరించారు.





బొమ్మలు అదుర్స్

తెలుగు చిత్రకళా రంగంలో తమదైన ప్రత్యేకతకు చాటుకున్న ఆరుగురు ఆర్టిస్టులు గీసిన 'బ్లాక్ అండ్ వైట్' రేఖాచిత్రాల మాలికలు కళాభిమానులను అలరిస్తున్నాయి. రకరకాల థీమ్స్‌తో తెల్ల కాగితంపై నల్ల గీతలతో ఆకృతి దాల్చిన 90కుపైగా రేఖాచిత్రాలు అదుర్స్ అనిపించాయి. శంకర్ పామర్తి, తల్లావజల శివాజీ. మాకినీడి శ్రీనివాసరామ్, రాజేష్ నాగులకొండ తదితరులు వేసిన ఈ చిత్రాలు బంజారాహిల్స్ రోడ్డు నంబరు 12లోని ఐకాన్ ఆర్ట్‌గ్యాలరీలో ప్రదర్శిస్తున్నారు. ఈ నెల 16 వరకు ఈ ప్రదర్శన కొనసాగుతుందనినిర్వాహకులు చెప్పారు.

- (హైదరాబాద్ సిటీ, ఆంధ్రజ్యోతి)

అభివృద్ధి పనులు పూర్తి చేయాలి

- ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

నల్లకుంట, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): అంబర్‌పేట నియోజకవర్గంలో రూ. 10కోట్లతో చేపడుతున్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తిచేయాలని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ సూచించారు. బుధవారం నల్లకుంట డివిజన్‌లోని బాయమ్మగల్లీలో రూ.1.60కోట్లతో చేపడుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను జీహెచ్‌ఎంసీ, జలమండలి అధికారులతో కలిసి ఎమ్మెల్యే పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని ఐదు మున్సిపల్ డివిజన్లలో చేపడుతున్న తాగునీటి, డ్రైనేజీ పైప్‌లైన్ వ్యవస్థ ఆధునికీకరణ, నూతన సీసీ రోడ్ల నిర్మాణం, పార్కుల సుందరీకరణ వంటి పనులను దశలవారీగా చేపడుతున్నట్లు పేర్కొన్నారు. నియోజకవర్గంలోని పలు కాలనీలు, బస్తీల్లో నెలకొన్న సమస్యలను ఎప్పటికప్పుడు పాదయాత్ర ద్వారా గుర్తించి వివిధ శాఖ అధికారులతో చర్చించి వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జలమండలి జనరల్ మేనేజర్ శ్రీధర్‌రెడ్డి, డీజీఎం విష్ణువర్ధన్‌రావు, ఏఈ రోహిత్, జీహెచ్‌ఎంసీ ఏఈ ప్రశాంత్, వర్క్ ఇన్‌స్పెక్టర్ నరేంద్ర, బీఆర్ఎస్ నాయకులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, జీహెచ్‌ఎంసీ, జలమండలి అధికారులు

కామారెడ్డి డిక్లరేషన్‌ను అమలు చేయాలి

- తెలంగాణ బీసీ పొలిటికల్ ఫ్రంట్ చైర్మన్ బాల్‌రాజ్‌గౌడ్

రాంనగర్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ చేసిన కామారెడ్డి డిక్లరేషన్‌ను వెంటనే అమలు చేయాలని, లేనిపక్షంలో పెద్దఎత్తున బీసీ ఉద్యమం చేపడతామని తెలంగాణ బీసీ పొలిటికల్ ఫ్రంట్ చైర్మన్ బి.బాల్‌రాజ్‌గౌడ్ హెచ్చరించారు. కామారెడ్డి డిక్లరేషన్ అమలు కోసం ఈనెల 15న తెలంగాణ బీసీ పొలిటికల్ ఫ్రంట్ ఆధ్వర్యంలో బీసీ ఆక్రోశ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బుధవారం చిక్కడపల్లిలోని ఫ్రంట్ కార్యాలయంలో సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తుందని ఆరోపించారు. ఈ ఆక్రోశ సభకు బీసీలు పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ చైర్మన్ డాక్టర్ విశారదన్ మహారాజ్ మాట్లాడుతూ బహుజన రాజ్యస్థాపన కోసం ఐక్య ఉద్యమాలు నిర్మిస్తామన్నారు. బీసీ పొలిటికల్ ఫ్రంట్ రాష్ట్ర కన్వీనర్ ఆయిలి వెంకన్నగౌడ్ మాట్లాడుతూ రాజ్యాంగ సవరణ ద్వారా బీసీ రిజర్వేషన్ అమలవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ పొలిటికల్ ఫ్రంట్ నాయకులు యెలికట్టె విజయ్‌కుమార్‌గౌడ్, అంబాల నారాయణగౌడ్, ఎం.వి.నాగభూషణం, బడేసాబ్, జి.విజయ్‌కుమార్‌గౌడ్, భాస్కర్, మెట్టు ధన్‌రాజ్, ఓయూ జేఏసీ నాయకులు సాంబశివగౌడ్, రాజు తదితరులు పాల్గొన్నారు.



అభివాదం చేస్తున్న బాల్‌రాజ్‌గౌడ్ తదితరులు

వాల్మీకీనగర్ అపార్ట్‌మెంట్‌లో అగ్నిప్రమాదం

- టీవీ, ఫ్రిజ్, కిచెన్, ఫర్నీచర్ దగ్ధం
- ఇంట్లో ఎవరూ లేకపోవడంతో తప్పిన ప్రమాదం

చిక్కడపల్లి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): గాంధీనగర్ డివిజన్ వాల్మీకీనగర్ బస్తీలోని ఓ అపార్ట్‌మెంట్‌లో అగ్నిప్రమాదం సంభవించింది. ఈ సంఘటనలో ఫర్నీచర్, టీవీ, ఫ్రిజ్, వంటసామగ్రి దగ్ధమైంది. మొత్తంగా ఇంట్లోని రెండు గదులు పూర్తి మసిబారిపోయాయని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. ఉదయం ఇంట్లో దీపాలు వెలిగించిన ఇంటివారు బయటకు వెళ్లడంతో దీపాలు అంటుకుని సంఘటన చోటుచేసుకున్నట్లు పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది అంచనా వేస్తున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. సృజన అపార్ట్‌మెంట్‌లో యాదగిరి అనే వ్యక్తి స్టేషనరీ షాపు నిర్వహిస్తున్నాడు. సాయంత్రం ఐదున్నర ప్రాంతంలో దీపాలు వెలిగించి ఇంట్లో నుంచి బయటకు వెళ్లారు. సెకండ్‌ఫ్లోర్ నుంచి పొగలు, మంగలు వస్తుండడంతో అప్రమత్తమైన అపార్ట్‌మెంట్‌వాసులు, స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. కాగా ముషీరాబాద్, గాంధీ ఆస్పత్రి ఫైర్‌స్టేషన్‌ల నుంచి రెండు ఫైరింజన్‌లు, డీఆర్‌ఎఫ్ సంఘటనాస్థలానికి చేరుకుని నలభై నిముషాలు శ్రమించి మంటలను అదుపులోకి తెచ్చారు. సంఘటనాస్థలానికి చేరుకున్న ఎస్‌ఐ దుర్గ, పోలీసు సిబ్బంది వివరాలు సేకరించారు. అయితే ఎవరికి ఏమీ కాకపోవడంతో పెను ప్రమాదం తప్పిందని అపార్ట్‌మెంట్‌వాసులు, స్థానికులు, పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు. ఆస్తినష్టం బాగానే ఉంటుందని భావిస్తున్నారు.



మంటల్లో కాలిపోయిన ఫ్రిజ్

వైభవంగా గూడ తైలాభిషేకం

చిక్కడపల్లి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీక్రాస్‌రోడ్‌లోని లక్ష్మీగణపతి ఆలయం ఆవరణలో ఉన్న పార్వతీక్షీరలింగేశ్వర స్వామి మందిరంలో జరుగుతున్న కార్తీకమాస మహోత్సవాల్లో భాగంగా బుధవారం స్వామి వారికి గూడ తైలాభిషేకం పూజాకార్యక్రమాన్ని వైభవోపేతంగా నిర్వహించారు. లక్ష్మీగణపతి ఆలయంలో సైతం గూడ తైలాభిషేకం కార్యక్రమం నిర్వహిచారు. ఈసందర్భంగా ఏకాదశరుద్రాభిషేకం, మహాన్యాసరుద్రాభిషేకం, ఆకాశదీపపూజ, కార్తీకపురాణప్రవచనం, భక్తులచే దీపారాధన, ప్రదోషపూజ బిల్వార్చన, నివేదన, హారతి, మహామంత్రపుష్పం, తీర్థప్రసాద వితరణ కార్యక్రమాలను ఆలయ ఈవో లక్ష్మారెడ్డి, చైర్మన్ మారిశెట్టి నర్సింగ్‌రావు, ఆలయ సిబ్బంది పర్యవేక్షించారు.

బీజేపీ నుంచి మోహన్‌రెడ్డి బహిష్కరణ

బర్కత్‌పుర, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఉపఎన్నికల్లో పార్టీ వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడిన షేక్‌పేట డివిజన్‌కు చెందిన కంది మోహన్ రెడ్డిని బీజేపీ నుంచి బహిష్కరిస్తున్నట్లు ఆ పార్టీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏడెల్లి అజయ్‌కుమార్ తెలిపారు. ప్రస్తుతం జరిగిన ఉప ఎన్నికల్లో కంది మోహన్‌రెడ్డి పార్టీకి వ్యతిరేకంగా పనిచేశారని తెలిపారు. సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు, జూబ్లీహిల్స్ బీజేపీ అభ్యర్థి లంకల దీపక్‌రెడ్డి ఆదేశాలకు అనుగుణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు వారు తెలిపారు.

రైలు ప్రయాణికుడి బ్యాగు తస్కరణ

బర్కత్‌పుర : విలువైన సర్టిఫికెట్లు ఉన్న ఓ రైలు ప్రయాణికుడి బ్యాగును దొంగలు తస్కరించారు. కాచిగూడ రైల్వే పీఎస్ సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం.. ఆసిఫాబాద్‌కు చెందిన సానిత్‌కుమార్(25) మహారాష్ట్రలోని నందూర్‌బార్‌లో ఓకేఏ-రామేశ్వరం ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కాడు. మహారాష్ట్ర ఉమ్రిలో అతని బ్యాగును దొంగలు తస్కరించారు. ఆబ్యాగులో ఎస్ఎస్‌సీ, ఇంటర్, ఇంజనీరింగ్ ఒరిజినల్ మెమోలు ఉన్నాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని తదుపరి విచారణ నిమిత్తం నాందేడ్ రైల్వే పీఎస్‌కు బదిలీ చేసినట్లు సీఐ తెలిపారు. మరో సంఘటనలో కాచిగూడ రైల్వే స్టేషన్‌లోని 4వ ప్లాట్‌ఫారం వద్ద రైలు దిగుతున్న ప్రయాణికుడి సెల్‌ఫోన్ కిటికీలో నుంచి దొంగ లాక్కొని పారిపోయాడు. మహారాష్ట్రకు చెందిన మహాదేవ్ గుంగు(37) షాద్‌నగర్‌లో కాచిగూడ గుంటూరు ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కాడు. బుధవారం కాచిగూడ రైల్వేస్టేషన్‌లో దిగుతుండగా ఈ సంఘటన జరిగింది. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

బంగారు రింగు, నగదు తస్కరణ

బర్కత్‌పుర : రైలు ప్రయాణికురాలి బంగారు రింగు, నగదును దొంగలు తస్కరించారు. కాచిగూడ రైల్వే పీఎస్ సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం.. తిరుమలగిరికి చెందిన జోహార్ రంగు నాలా(48) తన సతీమణితో కలిసి వడోదరలో కాచిగూడకు రావడానికి ఓకేఏ ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కారు. నిజామాబాద్ వద్ద అతడి సతీమణి హ్యాండ్ బ్యాగును దొంగలు తస్కరించారు. ఆ బ్యాగులో 5 గ్రాముల బంగారు రింగు, రూ.4వేల నగదు, సెల్‌ఫోన్, క్రెడిట్ కార్డు ఉన్నాయి. బుధవారం కాచిగూడ రైల్వే పీఎస్‌లో వారు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని తదుపరి విచారణ నిమిత్తం నిజామాబాద్ రైల్వే పీఎస్‌కు బదిలీ చేసినట్లు సీఐ తెలిపారు.

ఆకట్టుకున్న సత్యహరిశ్చంద్ర పద్యనాటకం

చిక్కడపల్లి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): పద్యనాటకాల వల్ల మన పౌరాణిక కథల గురించి ప్రజలకు తెలుస్తుందని ప్రముఖ సాహితీవేత్త డా. ఓలేటి పార్వతీశం అన్నారు. భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో శారద కళానికేతన్ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి త్యాగరాయగానసభలో సత్యహరిశ్చంద్ర పద్యనాటకంలోని కాటిదృశ్యంలో సతీష్‌పాల్ ప్రదర్శించిన నటన, పద్యాలాపన అదేవిధంగా కురుక్షేత్రం నాటకంలోని దుర్యోధన సమాలోచన దృశ్యంలో మామిడి సంజీవరావు ఏకపాత్రాభినయం ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ప్రఖ్యాత హాస్య అవధాని ప్రముఖ జర్నలిస్ట్ శంకరనారాయణను ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఓలేటి పార్వతీశం సత్కరించి రేలంగి పురస్కారం, చతుర ఛలోక్తి చక్రవర్తి బిరుదును బహూకరించి సత్కరించారు. గానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి మాట్లాడుతూ శంకరనారాయణ అత్యంత ప్రతిభావంత జర్నలిస్ట్ అని ఆయన నలభై ఏళ్ళ జర్నలిజం వృత్తిలో వివిధ శీర్షికలతో పాఠకుల మెప్పు పొందారని ప్రశంసించారు. యువకళావాహిని అధ్యక్షుడు లంక లక్ష్మీనారాయణ, సరస్వతీ ఉపాసకులు దైవజ్ఞశర్మ పాల్గొనగా రాజబాబు, అనిల్ కార్యక్రం నిర్వహణ చేశారు.



శంకరనారాయణను సత్కరిస్తున్న ఓలేటి పార్వతీశం, కళా జనార్దనమూర్తి, లంకా లక్ష్మీనారాయణ

ఆసరా బకాయిలను విడుదల చేయాలి

కవాడిగూడ, నవంబరు 12(ఆంధ్రజ్యోతి) : ఆసరా పెన్షన్ల బకాయిలు తక్షణమే చెల్లించి లబ్ధిదారులను ఆదుకోవాలని ఆమ్‌ఆద్మీపార్టీ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ డిమాండ్ చేశారు. బుధవారం దోమలగూడ లిబర్టీ చౌరస్తాలోని పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో డాక్టర్ దిడ్డి సుధాకర్ మాట్లాడుతూ ఆసరా పెన్షన్లు రెండువేల నుంచి నాలుగువేలకు పెంచుతామని దివ్యాంగులకు నాలుగువేల నుంచి ఆరువేలకు పెంచుతామని కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో చేసిన వాగ్దానం ఇంతవరకు అతిగతి లేకపోవడం అన్యాయమన్నారు. రాష్ట్రంలోని చాలా జిల్లాల్లో పింఛన్ డబ్బుల బకాయిల కోసం వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు ఎదురుచూస్తున్నారని అన్నారు. ఈ విలేకరుల సమావేశంలో ఆమ్‌ఆద్మీపార్టీ రాష్ట్ర నాయకులు బుర్రా రాముగౌడ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న దిడ్డి సుధాకర్ తదితరులు

జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించాలి

రాంనగర్ : బీసీలకు జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించాలని సొసైటీ ఫర్ ద డెఫ్ జాతీయ కన్వీనర్, దివ్యాంగుల జాతీయ సంక్షేమ సంఘం అధ్యక్షుడు వల్లభనేని ప్రసాద్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం బాగ్‌లింగంపల్లిలోని సంఘం కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ స్థానిక సంస్థల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ శీతకాల పార్లమెంట్ సమావేశంలో బిల్లుపెట్టి ఆమోదించాలన్నారు. దివ్యాంగులకు అన్ని ప్రభుత్వ శాఖల్లో రిజర్వేషన్ల ప్రకారం ఉద్యోగ అవకాశం కల్పించాలన్నారు. బీసీల డిమాండ్ల సాధన కోసం తమ సంఘం పక్షాన ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు కాటమనేని వెంకటేష్ పాల్గొన్నారు.

14 నుంచి తపాలా స్టాంపులు, నాణేలు, పేపర్ కరెన్సీ ప్రదర్శన

నల్లకుంట, నవంబరు 12(ఆంధ్రజ్యోతి) : ఫిలాటెలిక్ అండ్ హాబీస్ సొసైటీ ఆధ్వర్యంలో ఈనెల 14 నుంచి 16వ తేదీ వరకు నగరంలోని రెడ్‌హిల్స్‌లోని ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీలో తపాలా స్టాంపులు, నాణేలు, పేపర్ కరెన్సీ, పురాతన వస్తువుల ప్రదర్శన హైపెక్స్-2025 ఎగ్జిబిషన్ నిర్వహిస్తున్నట్లు సొసైటీ కార్యదర్శి సాగి శ్రీనివాసరాజు తెలిపారు. బుధవారం హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో విలేకరుల సమావేశంలో ఫిలాటెలిక్ అండ్ హాబీస్ సొసైటీ జాయింట్ సెక్రటరీ ఎస్.శ్రీకాంత్, మేనేజింగ్ కమిటీ సభ్యులు సంతోష్‌రెడ్డి, రాధాకృష్ణ, దీపక్‌కుమార్ సేథియాలతో కలిసి సాగి శ్రీనివాసరాజు మాట్లాడారు. ఈ ఎగ్జిబిషన్‌లో దేశం మొత్తం నుంచి 60స్టాల్స్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. తపాలా స్టాంపులు, నాణేలు, పేపర్స్ కరెన్సీ, పురాతన వస్తువుల ఎగ్జిబిషన్‌పై నగరంలోని పాఠశాలలు, ఇతర సంస్థల్లో ప్రదర్శనలు, సదస్సులు, కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా అభిరుచులను వ్యాప్తి చేస్తున్నట్లు తెలిపారు. ఈ ఎగ్జిబిషన్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా చీఫ్ పోస్ట్‌మాస్టర్ హైదరాబాద్ జీపీవో వీణాకుమారి హాజరవుతారని ఆయన తెలిపారు.



మాట్లాడుతున్న సాగి శ్రీనివాసరాజు తదితరులు

22న మహిళా కళాశాల స్నాతకోత్సవం

బర్కత్‌పుర : రాజాబహదూర్ వెంకటరామారెడ్డి మహిళా కళాశాల 14వ స్నాతకోత్సవాలను ఈనెల 22న కళాశాల ఆడిటోరియంలో నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జె.అచ్యుతదేవి తెలిపారు. బుధవారం కళాశాలలో హైదరాబాద్ మహిళా విద్యాసంఘం కార్యదర్శి ప్రొఫెసర్ కె. ముత్యంరెడ్డి, కళాశాల సెక్రటరీ కమ్ కరస్పాండెంట్ ప్రొఫెసర్ జి.సుదర్శన్‌రెడ్డి, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ టి.వాణి మాదవిలతో కలిసి ఆమె స్నాతకోత్సవాల ఆహ్వానపత్రికను ఆవిష్కరించారు. 2023-24 విద్యా సంవత్సరంలో ఉత్తీర్ణులైన విద్యార్థులకు డిగ్రీలను ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. విద్యలో అత్యుత్తమ ప్రతిభను కనబరిచిన విద్యార్థులకు బంగారు పతకాలను అందజేసి ప్రోత్సహించనున్నట్లు తెలిపారు. ప్రదానోత్సవాలకు కలెక్టర్ హరిచందన దాసరి, ఓయూ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ కె.శశికాంత్ హాజరవుతారని తెలిపారు. వైస్ ప్రిన్సిపాల్ కె.సింధూరి, కన్వీనర్ డాక్టర్ ఎం.సుచిత్ర, కో-కన్వీనర్ డాక్టర్ కె.స్వప్న పాల్గొన్నారు.

ఘనంగా పోచమ్మ ఆలయం వార్షికోత్సవం

రాంనగర్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి) : బాగ్‌లింగంపల్లిలోని అచ్చయ్య నగర్‌లోని పోచమ్మ ఆలయ వార్షికోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిగాయి. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ కె.రవిచారి పాల్గొని ఆలయంలో పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని కార్పొరేటర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొని పూజలు చేశారు.

బస్తీలో చెత్తకుప్పలు తొలగింపు

చిక్కడపల్లి : గాంధీనగర్ డివిజన్ అరుంధతినగర్ బస్తీలో చాలారోజులుగా పేరుకుపోయిన చెత్తకుప్పను స్థానిక కార్పొరేటర్ ఎ. పావనీవినయ్‌కుమార్ ఆదేశాల మేరకు జీహెచ్‌ఎంసీ పారిశుధ్య సిబ్బంది బుధవారం తొలగించారు. బస్తీలో చాలా రోజులుగా చెత్త గుట్టలుగా పేరుకుపోయిందని మున్సిపల్ సిబ్బంది తొలగించడం లేదని బస్తీలో దుర్వాసన వస్తోందని స్థానికులు ఫిర్యాదు చేయడంతో స్పందించిన కార్పొరేటర్ సూచనలతో మున్సిపల్ సిబ్బంది బస్తీలోకి వాహనాలతో పాటు చేరుకుని చెత్త కుప్పలను తొలగించారు. స్వామి, దాస్, శ్రీనివాస్, చందర్ పాల్గొన్నారు.



చెత్త తొలగిస్తున్న జీహెచ్‌ఎంసీ సిబ్బంది

కృష్ణయ్యకు ఆత్మీయ సత్కారం

చిక్కడపల్లి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): శ్రీసర్వేశ్వర నాట్యమండలి వారు రాష్ట్ర భాషా సాంస్కృతికశాఖ సౌజన్యంతో త్యాగరాయగానసభలో బుధవారం పద్యనాటకోత్సవం కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా శ్రీకృష్ణరాయబా రం నాటక ప్రదర్శన ఆకట్టుకునేలా జరిగింది. అనంతరం జరిగిన సభలో సాం స్కృతికరంగ ప్రముఖుడు లోకం కృష్ణయ్యకు ఆత్మీయసత్కారం నిర్వహించి కళాబ్రహ్మ బిరుదు ప్రదానం చేశారు. సరస్వతీఉపాసకులు దైవజ్ఞశర్మ, ప్రముఖ నా ట్యగురువు పసుమర్తి శేషుబాబు, సంస్థ స్థాపకుడు రాజబాబు పాల్గొన్నారు.

అయ్యప్ప భక్తులకు అన్నదానం

చిక్కడపల్లి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): చిక్కడపల్లి వివేక్‌నగర్ అష్టలక్ష్మి ఆలయం వద్ద ఆలయ నిర్వాహకులు, అయ్యప్ప గురుస్వామి కాజా పూర్ణచందర్ ఆధ్వర్యంలో బుధవారం మధ్యాహ్నం అయ్యప్ప భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. దాదాపు 100 మందికి అన్నదానం జరిగింది. ప్రతి బుధవారం ఈ కార్యక్రమం ఉంటుందని ఆయన వివరించారు.

సుందరయ్యపార్కులో ఆహ్లాదకర వాతావరణం కల్పించాలి

రాంనగర్ : బాగ్‌లింగంపల్లి సుందరయ్యపార్కులో ఆహ్లాదకరమైన వాతావరణాన్ని వాకర్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సెంట్రల్ పేరుతో ఉన్న సంస్థ దెబ్బతీస్తుందని, వెంటనే గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ జోక్యం చేసుకుని పార్కుకు వచ్చే వాకర్స్‌కు మంచి వాతావరణాన్ని కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని సుందరయ్యపార్కు వాకర్స్ కోరారు. వాకర్స్ సభ్యులు వెంకటకృష్ణ, రాజేంద్రప్రసాద్‌గౌడ్, కాసాని ఆనంద్, మన్నె దామోదర్‌రెడ్డి, కిషన్‌రావు, వెంకటస్వామిగౌడ్, రాయపాటి రవి తదితరులు బుధవారం జీహెచ్‌ఎంసీ జోనల్ కమిషనర్ డాక్టర్ రవికిరణ్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో రఫీ అహ్మద్, ఆర్.జయదేవ్, శంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

వాకర్స్‌క్లబ్ హైదరాబాద్ సెంట్రల్‌కు 23న ఎన్నికలు

రాంనగర్ : బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్యపార్కు వాకర్స్‌క్లబ్ హైదరాబాద్ సెంట్రల్‌కు ఈనెల 23న ఎన్నికల నిర్వహణకు ఎన్నికల అధికారి డాక్టర్ కె.రామానందం బుధవారం ఎన్నికల షెడ్యూల్ విడుదల చేశారు. ఈ ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఈనెల 14 వరకు ఎన్నికల అధికారికి 10వేల రూపాయల ఫీజు చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. నామినేషన్ల స్క్రూట్నీ ఈనెల 16న నిర్వహిస్తామని, 17న నామినేషన్ల విత్‌డ్రాకు తుది గడువు అని తెలిపారు. 23న ఉదయం 7నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు బ్యాలెట్ పద్ధతిలో ఎన్నికలు జరుగుతాయని తెలిపారు. కౌంటింగ్ అదేరోజు జరుగుతుందని, సాయంత్రం ఫలితాలు వెల్లడిస్తామన్నారు.

రైలులో నలుగురు బాల కార్మికులను అదుపులోకి తీసుకున్న పోలీసులు

బర్కత్‌పుర, నవంబరు 12(ఆంధ్రజ్యోతి) : కర్నాటక సంపర్క్‌క్రాంత ఎక్స్‌ప్రెస్ రైలులో నలుగురు బాల కార్మికులను పోలీసులు అదుపులోకి తీసుకుని చిల్డ్రన్స్ హోమ్‌కు తరలించారు. వీరిని అక్రమంగా తీసుకెళ్తున్న యూపీ, బిహార్ రాష్ట్రాలకు చెందిన నలుగురిపై కేసు నమోదు చేశారు. కాచిగూడ రైల్వే పీఎస్ సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం.. కాచిగూడ రైల్వేస్టేషన్‌లో బుధవారం బీఆర్‌పీ, ఆర్‌పీఎఫ్, సీడబ్ల్యూసీ సంయుక్తంగా నిర్వహించిన ఆపరేషన్‌లో నలుగురు బాల కార్మికులను గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. వీరిని మోండా మార్కెట్‌లోని ఆశ్విత చైల్డ్ హోమ్‌కు తరలించారు. నలుగురు బాల కార్మికులను అక్రమంగా తీసుకెళ్తున్న బిహార్‌కు చెందిన చిడిగా(45), ఉత్తరప్రదేశ్‌కు చెందిన మహమ్మద్(26), మహమ్మద్ హుస్సేన్(27), జితేందర్ చౌదరి(20)లను అదుపులోకి తీసుకుని వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

నేడు ప్రాణధార కథానిక సంపుటి ఆవిష్కరణ

చిక్కడపల్లి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): మానస ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో గురువారం త్యాగరాయగానసభలో ప్రముఖ కవి, రచయిత అంబల్ల జనార్దన్ రచించిన ప్రాణధార కథానిక సంపుటి ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి రఘుశ్రీ తెలిపారు. ప్రముఖ రచయిత కూర చిదంబరం అధ్యక్షతన జరిగే కార్యక్రమంలో సెంట్రల్ యూనివర్సిటీ ఆచార్యులు పిల్లలమర్రి రాములు హాజరై పుస్తకాన్ని ఆవిష్కరిస్తారని వివరించారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

చిక్కడపల్లి నవంబరు 12(ఆంధ్రజ్యోతి) : ఆజామాబాద్ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో గురువారం విద్యుత్ సరఫరా ఉండదని సీబీడీ ఏడీఈ జి. నాగేశ్వరరావు తెలిపారు. సాయిబాబా టెంపుల్, సీతకాలనీ, గోల్కొండక్రాస్‌రోడ్ పరిధిలో ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 1గంటవరకు, మౌలానా ఆజాద్‌నగర్ పరిధిలో 10నుంచి 12వరకు, నెహ్రూనగర్‌లో 11.30నుంచి 1 వరకు, రామాలయం, స్పెన్సర్, ఎల్ఎన్ నగర్ పరిధిలో 2నుంచి సాయంత్రం 5వరకు వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.